జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శనివారం | 13-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 536 పేజీలు: 4 వెల : రూ.7


# చావుకైనా సిద్ధం.. వేట వదలం

* సంద్రంలో వేట వద్దంటే ఎలా బతికేది?
* వేట సమయంలో గ్రీడ్జింగ్ పనులు ఆపండి
* పోర్టు అధికారులకు తెలిపిన మత్స్యకారులు
* భద్రత విషయంలో కాంప్రమైజ్ అవ్వలేం
* గ్రీడ్జింగ్ సమయంలో వేట చేస్తే బోట్లకు ప్రమాదం * పోర్టు అధికారులు



సంతబొమ్మాళి, డిసెంబర్ 12 (వార్త):ప్రస్తుతం సముద్రంలో చేపలు పడే సమయం.. వేట వద్దంటే మేం బతికేది ఎలా? మా జీవనం సాగేది ఎలా? చావుకైనా సిద్ధం కాని వేట మాత్రం ఆపేది లేదని మత్స్యకారులు, సంఘ ప్రతినిధులు మూలపేట పోర్టు అధికారులకు తేల్చిచెప్పారు. శుక్రవారం మూలపేటలో మత్స్యకారులతో మూలపేట పోర్టు అధికారులు సమావేశమయ్యారు. పోర్టు అధికారులు మాట్లాడుతూ సేఫ్టీ విషయంలో కాంప్రమైజ్ అయితే ప్రమాదం బారిన పడతామన్నారు. సముద్రంలో గ్రిడ్జింగ్ అయ్యే సమయంలో బోట్లు వస్తే ప్రమాదం జరుగుతుందని దీంతో ఇద్దరం బాధపడవలసి వస్తుందన్నారు. గ్రిడ్జింగ్ చేసే ప్రాంతంలో కాకుండా మిగతా సముద్రంలో వేట చేసుకోవాలన్నారు. గ్రిడ్జింగ్ జరిగే సమయంలో ఆ ప్రాంతానికి బోట్లు వస్తే క్షణాల్లో ముక్కలు ముక్కలు అయిపోతాయని అన్నారు. దీనికి మత్స్యకారులు స్పందిస్తూ చేపలు పడే సీజనని ఈ సమయంలో చేపలు వేటాడ కూడదంటే ఎలా అన్నారు. ప్రస్తుతం గ్రీడ్జింగ్ పనులు ఆపాలన్నారు. మీ సమస్యను పోర్టు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తామని మత్స్యకారులకు అధికారులు తెలియజేశారు. సమావేశంలో మత్స్యకార సంఘ నాయకులు అల్ల రాజేష్, ఎ.పోతయ్య, కారాడ చిన్నబాబు, కారాడ పోతయ్య, కారాడ చిన్నయ్య, జిల్లా మత్స్యశాఖ జేడీ సత్యనారాయణ, ధర్మరాజు, మెరైన్ సీఐ రాము, మత్స్యకారులు పాల్గొన్నారు.



## నిందితుడు మురళీకృష్ణ ఆచూకి తెలియజేయండి

* నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 12 (వార్త):** పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న గేదెల మురళీకృష్ణ రెండేళ్లుగా పరారీలో ఉన్నాడని, అతని ఆచూకి తెలి సిన వారు పోలీసులకు సమాచారం అందజేయాలని నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పాతపట్నం మండలం పాసిగంగుపేట గ్రామానికి చెందిన గేదెల మురళీకృష్ణపై నాన్ బెయిల్ బుల్ వారెంట్ ఉందన్నారు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారన్నారు. నిందితుడి ఆచూకీ తెలిసిన వారు వెంటనే నరసన్నపేట సీఐ (63099 90815), సారవకోట ఎస్ఐ (63099 90879), పాతపట్నం ఎస్ఐ 6309990878) నంబర్లకు సమాచారం అందజేయాలని కోరారు.



## సమగ్ర వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ అందించాలి

* జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం, డిసెంబర్ 12((వార్త):** ప్రజలతో మర్యాదగా, నిస్వార్థంగా వ్యవహరించే విధంగా సమగ్ర వ్యక్తిత్వ వికాస శిక్షణ అందించాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సంబంధిత అధికారులను సూచించారు. ఇటీవల ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థుల శిక్షణా కార్యక్రమం నిర్వహణపై శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ అధ్యక్షతన అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐ, పోలీసు శిక్షణ కేంద్రం అధికారులు, సిబ్బంది, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు అధికారులతో కీలక సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత కానిస్టేబుళ్లపై ఉంటుందన్నారు. శిక్షణా కాలంలో అభ్యర్థులను క్రమశిక్షణ, ప్రజా సేవాభావం, నూతన సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలలో బలోపేతం చేసేవిధంగా శిక్షణ నిర్వహణ ఉండాలన్నారు. అభ్యర్థులకు శిక్షణా కాలమంతా నాణ్యమైన వసతి, భోజన సదుపాయాలు అందించాలన్నారు. ప్రతిరోజు ఫిజికల్ ట్రైనింగ్‌తో పాటు యోగ వంటి శిక్షణ తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు. నూతనంగా అమలవుతున్న చట్టాలు, పోలీస్ నిబంధనలపై పూర్తి అవగాహన కల్పించాలని, నేర పరిశోధనలో ఉపయోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు సి.హెచ్ వివేకానంద, డి లక్ష్మణరావు, జిల్లా వ్యాప్తంగా ఉన్న సీఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# శ్రమించాడు.. సాధించాడు!



* పొందూరు ఖాదికి జి.ఐ. టాగ్ కేటాయింపు * విశేష కృషి చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు * 2020 నుండి భౌగోళిక గుర్తింపు కోసం ప్రయత్నాలు * పార్లమెంట్ లో పలుమార్లు ప్రస్తావన తెచ్చిన రాము * తాజాగా విడుదలైన ధృవీకరణ పత్రం * హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా వాసులు

**శ్రీకాకుళం, డిసెంబర్ 12(వార్త):** కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శ్రమ ఫలించింది. శ్రీకాకుళం జిల్లాలో పుట్టి ప్రపంచ ఖ్యాతి సాధించిన పొందూరు ఖాదికి మళ్ళీ పూర్వ వైభవం సాధించి పెట్టేందుకు రామ్మోహన్ నాయుడు తీవ్రంగా కృషి చేశారు. ఆ కృషి ఫలితంగానే పొందూరు ఖాదికి భౌగోళిక గుర్తింపు ప్రకటిస్తూ వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ పరిధిలోని భౌగోళిక సూచికల రిజిస్ట్రీ శుక్రవారం అధికారిక పత్రాన్ని జారీ చేసింది. ఈ ప్రకటన పట్ల కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చెయ్యగా శ్రీకాకుళం జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### అసలేంటి జి.ఐ. టాగ్..?

ఒక్కో ప్రాంతంలో తయారయ్యే లేదా ఉత్పత్తి అయ్యే కొన్ని రకాల వస్తువులకు సహజంగా ఒక నాణ్యత ఉంటుంది. అదే వాటి ప్రత్యేకతగా నిలుస్తుంది.. ఆ విశిష్టతను దృష్టిలో ఉంచుకొని.. వాటికి మరింత ప్రాధాన్యత ఇచ్చే విదంగా "ది జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ ఆఫ్ గూడ్స్ (రిజిస్ట్రేషన్ అండ్ ప్రొటెక్షన్) యాక్ట్ 1999 ను ఏర్పాటు చేశారు. ఈ చట్టం క్రింద ఒక ప్రత్యేకమైన భౌగోళిక ప్రాంతంనుంచి వచ్చే ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఇండికేషన్) వర్తిస్తుంది.తద్వారా మిగిలిన ఉత్పత్తుల కన్నా, మేలైనవిగా, విలువైనవిగా భౌగోళిక గుర్తింపు పొందిన వస్తువులు నిలుస్తాయి. భౌగోళిక గుర్తింపు పొందిన వస్తువు.. నకిలీ వస్తువుల నుండి కాపాడబడుతుంది. విలువైనదిగా కూడా మారుతుంది.
ఇందుకోసం భోగోళిక సూచికల రిజిస్ట్రీ అనేక దఫాలుగా క్షేత్ర స్థాయి పరిస్థితులను అధ్యయనం చేస్తుంది. నాణ్యతని అన్ని దశల్లో పరీక్షిస్తుంది. ప్రజల్లో ఉన్న ఆదరణను సైతం




పరిగణలోకి తీసుకుంటుంది. అయితే మన దేశంలో అనేక విలువైన, అంతరించిపోయే దశలో అనేక ఉత్పత్తులు ఉన్నప్పటికీ చాలా కొద్ది వస్తువులు మాత్రమే ఈ తరహా భౌగోళిక గుర్తింపు సాధించగా.. అందులో పొందూరు ఖాదీకి జి.ఐ టాగ్ లభించడం వెనుక.. అప్పట్లో శ్రీకాకుళం ఎంపిగా, ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్ నాయుడు విశేష కృషి చేశారు.
2020 జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటించారు. ఆ సందర్భంగా పొందూరు ఖాది గురించి తెలుసుకున్నారు. ఇక్కడ నిర్మలా సీతారామన్ తో అప్పటి శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేకంగా భేటి అయ్యారు. అప్పటికే జి.ఐ టాగ్ విలువ తెలిసిన రామ్మోహన్ నాయుడు.. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కు పొందూరు ఖాది ఖ్యాతిని వివరిస్తూ.. జి.ఐ. టాగ్ ను కేటాయించాలని తొలుత కోరారు. దీనికి ఆమె నుండి కూడా సానుకూల స్పందన లభించింది. అనంతరం ఆగస్ట్ 3,2021 పార్లమెంట్ లో మాట్లాడిన రామ్మోహన్ నాయుడు.. మరోమారు జి.ఐ టాగ్ కోసం ప్రధానంగా, సుదీర్ఘంగా సభలో ప్రసగించారు. ఇక అది మొదలు అందుబాటులో ఉన్న అన్ని వేదికల్లో పొందూరు ఖాది ఖ్యాతిని వివరిస్తూ.. జి.ఐ టాగ్ కోసం యత్నించారు. కేంద్ర మంత్రి అయిన తరువాత మరింత వేగం పెంచారు. సంబంధిత శాఖపై ఈ తరహా గుర్తింపు సంఖ్య వచ్చేందుకు చర్యలు వేగవంతం అయ్యేలా కృషి చేశారు.




తాజా శుక్రవారం అధికారికంగా పొందూరు ఖాదికి సంబంధించిన జి.ఐ టాగ్ గుర్తింపు ప్రతి అందుబాటులోకి వచ్చింది. పొందూరు ఖాదికి జి.ఐ టాగ్ నంబర్ 1049 కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. చెన్నై కేంద్రంగా ఉన్న భోగోళిక సూచికల రిజిస్ట్రీ, ఇందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాన్ని వెలువడించింది. ఇంతవరకు బాస్మతి బియ్యం,డార్జిలింగ్ తేయాకు, కాంచీపురం పట్టుచీరలు, పోచంపల్లి చీరలు (2005), మైసూరు పట్టు, కొండపల్లి, నిర్మల్ బొమ్మలు, మైసూర్ శాండల్ సబ్బు.. ఇలా కొన్ని ఉత్పత్తులకు మాత్రమే భౌగోళిక గుర్తింపు ఉండగా.. ఇకపై పొందూరు ఖాది కూడా ఆ లిస్టులో చేరింది. దీని ద్వారా చట్టపరమైన గుర్తింపు, పొందూరు తప్ప.. ఈ తరహా విధానంలో ఇతరులు చేసే నకిలీ ఉత్పత్తులను అరికట్టే అవకాశం ఉంది.
గడచిన కొన్నేళ్లుగా తన ఉనికి కోసం ప్రయత్నిస్తూ ఉన్న పొందూరు ఖాదికి.. జి.ఐ టాగ్ గుర్తింపు వచ్చేలా కృషి చేసిన రామ్మోహన్ నాయుడు కు పొందూరు వాసులే కాదు.. ఉత్తరాంధ్ర ప్రాంతీయులు అభినందనలు తెలుపుతున్నారు. ప్రపంచ స్థాయి ఖ్యాతి ఉన్న పొందూరు ఖద్దరుకు.. జి.ఐ. గుర్తింపు రావడంతో భవిష్యత్ లో మరింతగా కీర్తి సంప్రదిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## దురలవాట్లకు దూరంగా ఉంటేనే భవిష్యత్తు బంగారం

**సోంపేట, డిసెంబరు 12(వార్త):** విద్యార్థులు క్రమశిక్షణతో విద్యపై దృష్టి కేంద్రీకరించాలని కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలంనాయుడు అన్నారు. చదువు, ఉన్నత విద్య, ఉపాధి వంటి అంశాలపై నిరంతరం శ్రమిస్తూ లక్ష్య సాధనకు కృషి చేయాలని హితవు పలికారు. శుక్రవారం ఆ కళాశాలలో ఈగల్ క్లబ్ ఏర్పాటు చేసి సమావేశం నిర్వహించి, ఆయన విద్యార్థులకు, అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని, అప్పుడే వారి భవిష్యత్ బంగారు మయమవుతుందన్నారు. కొంతకాలంగా మాదకద్రవ్యాల వైపు యువత ఆకర్షితులై భవిష్యత్‌ను బలి చేసుకుంటున్నారన్నారు. మన భవిష్యత్తు మన చేతిలోనే ఉందన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో ఈగల్ క్లబ్ కన్వీనర్ శ్రీను బాబు, కో కన్వీనర్ విష్ణుమూర్తి, ఎన్ఎస్ఎస్ పీఓ పాపారావు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి శివాజీని కలిసిన జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్



**పలాస, డిసెంబరు 12 (వార్త):** శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన పీరుకట్ల విఠల్ మాజీమంత్రి గౌతు శివాజీని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని, పార్టీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా తాను ప్రయత్నిస్తానని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులతో పాటు కూటమి నేతలను కలుపుకొని ఎమ్మెల్యే గౌతు శిరీషకు తోడ్పడుతానని పేర్కొన్నారు. తనను నియమించిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే శిరీష్‌కు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బూర్ల కృష్ణంరాజు, తమ్మినేని గంగారం, ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

## పెంట పంచాయతీ కార్యదర్శికి షోకాజ్




**జి.సిగడాం, డిసెంబరు 12 (వార్త):** చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ విఫలంపై ఐవీఆర్ఎస్ కాల్స్‌లో పలు ఫిర్యాదులు వెల్లడంతో పెంట పంచాయతీ కార్యదర్శి ఎ.దుర్గారావుకి శుక్రవారం డీపీవో షోకాజ్ నోటీసు మెయిల్ ద్వారా జారీ చేసినట్లు ఎంపీడీవో జి.రామకృష్ణారావు తెలిపారు. కార్యదర్శి పనితీరు, చెత్త నుంచి సంపద కేంద్రం నిర్వహణా లోపం తదితర అంశాలపై మూడు రోజుల్లోగా డీపీవో కార్యాలయానికి వచ్చి సంజాయిషీ ఇవ్వాలని, సంజాయిషీ సక్రమంగా లేనియెడల తదుపరి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆ నోటీస్‌లో పేర్కొన్నారు.

## యునైటెడ్ రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ ప్యానెల్‌కి మద్దతు ప్రకటించండి




**పలాస, డిసెంబరు 12 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ 25వ ఎన్నికల ప్రచారంలో భాగంగా పోటీదారులు శ్రీకాకుళం జిల్లా ఆసుపత్రి డ్రగ్ స్టోర్‌ను సందర్శించారు. ఫార్మసిస్టులకు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. జిల్లా ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షుడు హనుమంత్ సాయిరాం వారికి సభ్యులను పరిచయం చేశారు. తమ మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా పోటీదారులు మాలతి, కోలా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్యానల్ ఫార్మసిస్టుల ఉద్యోగ భద్రత, హక్కులను పరిరక్షించే బాధ్యత తీసుకుంటామని, ఫార్మసీ రంగ ప్రగతికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనెల గోపాల్, జిల్లా సెక్రటరీ పొన్నాడ విజయమోహన్, సీనియర్ కామ్రేడ్ గుంట సోమేశ్వరరావు, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లు తిరుపతిరావు, తులసి, రామచంద్ర, ఫార్మసీ ఆఫీసర్లు శైలజ, శ్రీనివాస్, ధనుంజయ, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

## తారు రోడ్డు పనులు ప్రారంభం



**సోంపేట, డిసెంబరు 12(వార్త):** కంచిలి మండలం ఆదివారం సంత నుంచి కేసరపడ మీదుగా అర్జునపురం వరకు తారు రోడ్డు నిర్మాణానికి శుక్రవారం పనులు ప్రారంభించారు. మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అడుగడుగునా గోతులతో అధ్వానంగా మారిన రోడ్డుకు నాబార్డ్ నుంచి నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. దీనిపై సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది.

## అభ్యుదయం సైకిల్ యాత్ర విజయవంతం చేయాలి

**ఇచ్ఛాపురం, డిసెంబరు 12 (వార్త):** ఇచ్ఛాపురం మండల ఈగల్ క్లబ్ సమావేశం ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ప్రిన్సిపాల్ చింతాడ శరత్ బాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. మండల కోఆర్డినేటర్ బోరుభద్ర సురేష్ కుమార్ సమావేశానికి హాజరై, వివిధ కళాశాలల కోఆర్డినేటర్లు, అసిస్టెంట్ కోఆర్డినేటర్లుకు దిశానిర్దేశం చేశారు. ఇచ్ఛాపురంను మత్తు రహిత సమాజంగా తయారుచేయాలని, మత్తు బారిన పడే వాళ్ళకి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చి వారికి మత్తు రహిత వ్యక్తులుగా మార్చాలని కోరారు. ఈ నెల 29న జరిగే అభ్యుదయం సైకిల్ యాత్ర విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్, స్వర్ణభారతి, ఆదిత్య జూనియర్ కళాశాలల కోఆర్డినేటర్లు, అసిస్టెంట్ కోఆర్డినేటర్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురు అధ్యాపకులు పాల్గొన్నారు.




# ఆరోగ్యమే మహాభాగ్యం

### - పలాస సివిల్ జడ్జి మాధురి

**పలాస, డిసెంబరు 12(వార్త):** ఆరోగ్యమే మహాభాగ్యమని గౌరవ అధ్యక్షుడు పలాస మండల న్యాయ సేవా సంఘం, పలాస సివిల్ జడ్జి యు.మాధురి అన్నారు. యూనివర్సల్ హెల్త్ కవరేజ్ డే వేడుకలు, ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సును పలాస కోర్టు ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి ఆరోగ్య పరిరక్షణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, సంపూర్ణ పౌష్టిక ఆహారాన్ని తీసుకొనడమే కాకుండా, ఆరోగ్య పరిరక్షణ కొరకు వ్యాయామము యోగ తదితర అంశాలను జీవితంలో భాగం చేసుకోవాలని తెలిపారు. అత్యవసర అనారోగ్య పరిస్థితులు వచ్చినప్పుడు ఆర్థిక ఇబ్బందులు రాకుండా ఉండడం కోసం ముందుగానే ఆరోగ్య బీమాను చేసుకొని ఉంచుకుంటే అవి అత్యవసర పరిస్థితులలో ఆర్థిక సహాయంగా ఉపయోగపడతాయని తెలిపారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరు వారి సంపాదనలో కొంత భాగాన్ని ఆర్థిక అవసరాల కొరకు పొదుపు చేయుట చాలా ప్రాధాన్యమని తెలిపారు. ఆరోగ్యాన్ని సరియైన జీవిత విధానాల ద్వారా కాపాడుకోగలమే గాని, కొనుక్కోలేమని కనుక ఆరోగ్యమే మహాభాగ్యం అని కూడా తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల ఉపాధ్యక్షులు, ప్యానెల్ లాయర్ బి.కామేశ్వరరావు పట్నాయక్, సీనియర్ న్యాయవాదులు జి.ప్రభాకర రావు, టి.శ్యామసుందరరావు, పి.చిట్టిబాబు, కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



# ఎట్టకేలకు ఎర్రముక్కాం రోడ్డుకు మోక్షం

### -రూ 2.36 కోట్లు నిధులు మంజూరు

### -కూటమి నేతలకు ప్రశంసలు

**సోంపేట, డిసెంబరు 12 (వార్త):** సోంపేట, మందస మండలాల పరిధిలోని సుమారు 30 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్న పాత జాతీయ రహదారి రాణిగాం నుంచి ఎర్రముక్కాం వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. రూ2.36 కోట్లతో నాలుగు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ అనుమతులు మంజూరు చేసింది. దీంతో రెండు మండలాల పరిధిలోని రైతులు, విద్యార్థులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లు వైకాపా హయాంలో రోడ్డు పొడవునా ఏర్పడిన గోతులతో ప్రజలు నానా అవస్థలు పడినా, పట్టించుకోలేదని స్థానిక టీడీపీ నేతలు బైపల్లి పేరయ్య, పిఎసిఎస్ చైర్మన్ బాలిగాం అధ్యక్షులు లబ్బ రుద్రయ్య, టీడీపీ అధికార ప్రతినిధి దాసరి తాతారావు తదితరులు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బెందాలం అశోక్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్ స్పందించి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. బారువా నుంచి రామయ్య పట్నం వెళ్లే రహదారికి రూ.2.9 కోట్లు మంజురు కావడంతో అనేక దశాబ్దాల కల కూటమి పాలనలో నెరవేరిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే, మండల టిడిపి నేతలు, సోంపేట మాజీ జెడ్పీటీసీ సభ్యులు చంద్రమోహన్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే బగ్గు



**పోలాకి, డిసెంబరు 12(వార్త):** కత్తిరివానిపేట మండల క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమయ్యారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన ప్రజల పలు సమస్యలను శ్రద్ధగా విని, వెంటనే సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేసి పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమణమూర్తి మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం. అందుకే ప్రజల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. నియో జకవర్గ అభివృద్ధి పనులకు మరింత వేగం పెంచుతున్నామని, ప్రతి కుటుంబం సంక్షేమాన్ని అనుభవించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలు, అభ్యర్థనలు వ్యక్తం చేశారు.

# మిల్లర్ల దోపిడీపై చర్యలు తీసుకోవాలి

### - వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**కొత్తూరు, డిసెంబర్ 12(వార్త):** రైతులు పంటలను అమ్ముకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభు త్వం తక్షణం జోక్యం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్య క్షుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో కలిసి అధికారులకు వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, అన్యాయాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలు, సహజ కారణాలతో రంగు మారిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం ఎటువంటి కోతలు లేకుండా కనీస మద్దతు ధరకి కొనుగోలు చేయాలని కోరారు. మిల్లర్లు రైతుల నుండి అధిక వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఈ దోపిడీని అరికట్టేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ, పౌర సరఫరాల శాఖలు వెంటనే చొరవ చూపాలని సూచించారు. సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు నాయకులు మన్మథరావు, సింహాచలం, సోమేష్, శివ, చిరంజీవి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యత లోపిస్తే సహించను

### - ఎమ్మెల్యే శిరీష

### - పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**పలాస, డిసెంబరు 12(వార్త):** అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల 20వ వార్డు, నేతాజీనగర్‌లో సుమారు రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డుకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. అక్కడ కాలనీవాసుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం 4వ వార్డ్, పద్మనాభ పురం కాలనీ, ఆంజనేయ విగ్రహం వద్ద సుమారు రూ.9.5లక్షలతో చేపట్టే సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. సమీప ప్రాంతంలో గల వెంకటేశ్వర కాలనీలో సుమారు రూ.10 లక్షలతో డ్రైనేజీకి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, దువ్వాడ శ్రీకాంత్, జి.సూర్యనారాయణ, టిడిపి నాయకులు బడ్డ నాగరాజు, లోడగల కామేష్, గాలి కృష్ణారావు, ముఖ్య నాయకులు, కాలనీవాసులు, కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆసక్తికరంగా బోధించాలి



**నరసన్నపేట, డిసెంబరు 12 (వార్త):** నరసన్నపేట మండల విద్యాశాఖ అధికారి ఉప్పాడ శాంతారావు శుక్రవారం కంబకాయ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల నిర్వహణ, బోధన విధానాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను వ్యక్తిగతంగా పరీక్షించడంతో పాటు పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల టీచింగ్ డైరీలను సమీక్షించారు. చదవడం, రాయడం రాని విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి విద్యలో ముందుకు నడిపించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు ఆసక్తి కలిగించే విధంగా బోధనా పద్ధతులను ఉపయోగించాలని, పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని ఆదేశించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయుల పాత్ర నిర్ణాయకమని ఎంఈవో పేర్కొన్నారు. తనిఖీల్లో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా సంఘాలను బలోపేతం చేయాలి

### -వెలుగు ఏపీఎం శ్రీనివాస్‌బాబు

**సారవకోట, డిసెంబరు 12 (వార్త):** మహిళా సంఘాలు మరింత బలపడే విధంగా చర్యలు తీసుకోవాలని వెలుగు ఏపీఎం శ్రీనివాస్‌బాబు సూచించారు. శుక్రవారం సారవకోటలోని వెలుగు సమావేశ మందిరంలో వీఓఏలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ మహిళా సంఘాలు పొదుపులను పెంచుకొని, అవసరమైనప్పుడు బ్యాంకు రుణాలు తీసు కుని సకాలంలో తిరిగి చెల్లించేవిధంగా పర్యవేక్షించాల్సిన బాధ్యత వీఓఏలపై ఉందని శ్రీనివాస్‌బాబు తెలిపారు. మహిళలు ఆర్థికంగా, స్వయం సమృద్ధిగా మారేందుకు సంఘాల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ ఎంతో కీలకమని ఆయన సూచించారు. మండలంలోని సంఘాల కార్యకలాపాలు, రుణాల విని యోగం, తిరిగి చెల్లింపులపై సమావేశంలో సమీక్ష జరిపారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, వీఓఏలు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఎంఐజీ లేఅవుట్ కొనుగోలుదారులు ఆందోళన చెందొద్దు

**పలాస, డిసెంబరు 12 (వార్త):** ఎంఐజీ లేఅవుట్ కొనుగోలుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం ఆమె పలాస లోని సబ్ ట్రెజరీ ఆఫీస్ నందు జరిగిన ఎంఐజి లేఅవుట్ లాటరీ లో పాల్గొన్నారు. అనంతరం ముత్యాలమ్మ కోనేరు వాకింగ్ లైటింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ విఠల్, ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు లోడగల కామేశ్వరరావు, డి.నరసింహులు, జి.సూర్యనారాయణ, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# గ్రంథాలయాలను ప్రజలకు మరింత చేరువ చేస్తా

### జిల్లా గ్రంథాలయ చైర్మన్ విఠల్

**పలాస, డిసెంబరు 12(వార్త):** జిల్లాలోని గ్రంథాలయాల్లో పూర్తి స్థాయిలో పుస్తకాలు, పాఠకులకు వసతులు కల్పించడానికి ప్రయత్నిస్తానని జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్ అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా పీరుకట్ల విఠల్‌ను ఎమ్మెల్యే గౌతు శిరీష సిఫార్సు మేరకు ప్రభుత్వం శుక్ర వారం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015 నుంచి 19 వరకు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షునిగా విజయవంతంగా నిర్వహించా నన్నారు. ఆనాడు రాష్ట్ర మంత్రి అచ్చంనాయుడు, ఎమ్మెల్యే శివాజీ ఆశీస్సులతో పార్లమెంటు సభ్యులు రామ్మోహన్‌నాయుడు, ఇతర శాసనసభ్యుల సహకారంతో జిల్లా గ్రంథాలయ సంస్థకు మళ్లీ ఊపిరి పోశానని తెలిపారు. అన్ని గ్రంథాల యాల్లో తగినన్ని పుస్తకాలు, వసతుల కల్పనకు పాఠకుల సౌకర్యార్థం చాలా కార్యక్రమాలు చేశానని, గార మండలంలో స్థల వివాదాన్ని పరిష్కరించి, నూతన భవనం పార్లమెంటు సభ్యుల వారి సహకారంతో ఆనాడు నిర్మించి ప్రారంభోత్సవం చేశానన్నారు. పాతపట్నంలో అదనపు భవనానికి ఎంపీ రామ్మోహన్‌నాయుడు రూ.10 లక్షలు కేటాయించడంతో నిర్మించామన్నారు. శ్రీకాకుళం కేంద్ర గ్రంథాలయంలో అసంపూర్తిగా ఉన్న మీటింగ్ హాల్‌ని, అప్పటి జిల్లా కలెక్టర్ సహకారంతో పూర్తి చేయించి ప్రారంభించానన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్ని అందరి సహకారంతో విజయవంతంగా నిర్వ హించానని, ముఖ్యంగా స్థానిక సంస్థల నుంచి రావాల్సిన ఎనిమిది శాతం సెస్ బకాయిలను వసూలు చేయించి రికార్డు సృష్టించానన్నారు. గ్రంథాలయా లకు ఆర్థిక పరిపుష్టిని కల్పించడమే కాకుండా గ్రంథాలయాల ఆవశ్యకతని గట్టిగా తెలియజెప్పానన్నారు. మళ్లీ ఈ రోజు రెండో సారి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షునిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించారన్నారు. ఇందుకు సహకరించిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబుకి, రాష్ట్ర మంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడుకి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకి, మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర్ శివాజీకి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కి, ఇతర జిల్లా పెద్దలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో పౌర గ్రంథాలయాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని రాష్ట్ర మంత్రివర్యులు అచ్చం నాయుడు, కేంద్ర మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఇతర శాసనసభ్యులందరి సహకారంతో నారా లోకేష్ ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి మారుతున్న



కాలమాన పరిస్థితులకు తగ్గట్టుగా పాఠకులకు డిజిటల్ లైబ్రరీ లను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు వీటిని మరింత చేరువ చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో వారికి కాంపిటేటివ్ పుస్తకాలను అందుబాటులో ఉంచి, వారి విజయానికి దోహదపడే విధంగా పని చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు లోడగల కామేష్, దువ్వాడ శ్రీకాంత్, బడ్డ నాగరాజు, ఎం.నరేంద్ర (చిన్ని), గాలి కృష్ణారావు, జి.సూర్యనారాయణ, కే.శంకరరావు, కార్యకర్తలు అభినందించారు.

## హరే కృష్ణ ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు



**నరసన్నపేట, డిసెంబర్ 12(వార్త):** నరసన్నపేట హరే కృష్ణ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఇందిరానగర్ పార్కులో శుక్రవారం నిర్వహించిన హరే కృష్ణ ఉత్సవానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మహా కుంభాభిషేకంలో పాల్గొని రాధా సమేత శ్రీకృష్ణ విగ్రహాలకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరే కృష్ణ ప్రచార సమితి ఆధ్వర్యంలో జరిగిన భజనలో పాల్గొని భక్తి గీతాలు ఆలపించిన ఎమ్మెల్యే, స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

భక్తి, సేవ, సనాతన సంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నరసన్నపేట పట్టణ టిడిపి నాయకులు, కార్యకర్తలు, భక్తులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తిని, స్నేహభావాన్ని పెంపొందించాలి

**- క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం**

**- ఎమ్మెల్యే గౌతు శిరీష**



**పలాస, డిసెంబరు 12(వార్త):** విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని, స్నేహభావాన్ని పెంపొందించాలని, ఆటల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం వజ్రపుకొత్తూరు మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 76వ పలాస నియోజకవర్గ స్థాయి అంతర పాఠశాలల బాల, బాలికల ఆటల పోటీలను శు క్రవారం ఆమె క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. బాలురకు కబడ్డీ, వాలీబాల్, కోకో, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, బాలికలకు అథ్లెటిక్స్ సీనియర్, జూనియర్ విభాగంలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి. హేమరావు, ఎంపీడీఓ రమేష్ నాయుడు, ఎస్ఎంసీ చైర్మన్ బి.లక్ష్మిపతి, సర్పంచ్ డి.పద్మావతి, ఎంపీటీసీ డి.మోహనరావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ డి.హేమంబాబు చౌదరి, ఎంఈఓ బి.వెంకటరమణ, గ్రామ పెద్దలు జయరాం చౌదరి, చక్రవర్తి, ఉపేంద్రరావు, నీలరావు, అప్పారావు, వ్యాయామ ఉపాధ్యా యులు పి.తవిటయ్య, కే.హరిబాబు, పి.గజేంద్ర, జే.నారాయణ పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనం




**మందస, డిసెంబరు 12(వార్త):** మాదకద్రవ్యాల వినియోగంతో మానవ జీవితం నాశనమవుతుందని ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్స్ గురుగుబెల్లి రమణమూర్తి అన్నారు. మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలో గల ప్రభుత్వ ,ప్రైవేటు జూనియర్ కళాశాలలోని ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్లుకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మందస రమణమూర్తి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిస కావద్దని, విద్యార్థులు బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని, వీటి వినియోగంతో మానవ జీవిత మనుగడకు పూర్తి ఆటంకం కలుగుతుందన్నారు. మత్తు పదార్థాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని, దేశ అభివృద్ధిలో యువత ముఖ్య పాత్ర పోషిస్తుందని, యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు వినియోగించిన వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించా లన్నారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.తేజేశ్వరరావు, అధ్యాపకులు బాడ వెంకటమోహన్, రామ్, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి , బి.మోహనరావు, లోక నాథం, సోమేశ్వరరావు, కర్రి జానకిరావు, బుర్లే లింగరాజు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా మండల స్థాయి గణిత క్విజ్ పోటీలు



**ఇచ్ఛాపురం, డిసెంబరు 12(వార్త):** ప్రముఖ గణిత శాస్త్రవేత్త, మేధావి శ్రీనివాస్ రామానుజం జయంతి సందర్భంగా కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి గణిత క్విజ్ పోటీలను ప్రధానోపాధ్యా యులు రాజం ప్రమీలకుమారి ప్రారంభించారు. ఈ పోటీల్లో మండల, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 16 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ప్రైజ్ మనీని స్థానిక పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు నరేంద్ర నాథ్ పట్నాయక్ సమకూర్చారు. వీరిలో మొదట బహుమతి(రూ.3000)ని డొంకురు పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రెండో బహుమతి (2000)ని పురుషోత్తపురం మోడల్ స్కూల్, మూడో బహుమతి (రూ.1000)ని రత్తకన్న మున్సిపల్ పాఠశాల, ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అందుకున్నారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల కుమారి, హిందీ ఉపాధ్యాయుడు నరేంద్ర నాథ్ పట్నాయక్ బహుమతులందించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు మొమెంటోలతో పాటు సర్టిఫికెట్స్ అందించారు. ఈ కార్యక్రమం గణిత ఉపాధ్యాయులు జ్యోతి, రామ్మోహన్, రేణుకా, చంద్ర వదన, ఫర్హాన షేక్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో క్విజ్ మాస్టర్‌గా పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు పాపారావు వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, అమిత బెహరా, శ్రీనివాస్ పూండి, రాజు, మినుచంద్ర, నీలిప్, రాజ్యలక్ష్మి, భవాని, ఉప్పాడ పాపారావు, కోటేశ్వర రావు, దేవకీ, వాణి, స్వప్న రాణి, సుప్రభ , పాల్గొన్నారు.

## వ్యాపారాభివృద్ధికి నాణ్యత, నమ్మకం కీలకం

**-మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్**




**నరసన్నపేట, డిసెంబరు 12 (వార్త):** నరసన్నపేటలో హరికృష్ణ షాపింగ్ మాల్‌ను శుక్రవారం మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారాభివృద్ధికి నాణ్యమైన వస్తువులను సరసమైన ధరలకు అందించాలని సూచించారు. ఈ మాల్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ మాల్ ప్రారంభోత్సవం సందడి వాతావరణంలో జరిగింది. కార్యక్రమంలో చింతు రామారావు, గుప్తా, పాగోటి రాజారావు, సర్పంచ్ బురల్లి శంకర్, దండి జయప్రకాశ్, కల్లేపల్లి లక్ష్మణరావు, ధర్మాన జగన్మోహన్, తంగుడు జోగారావు, వైశ్యరాజు కేశవరాజు, నేతింటి రాజారావు, పొట్నూరు పృధ్వీరాజ్, కోటిపల్లి శ్రీనివాసరావు, మానేం శివ, స్థానిక ప్రజలు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శివాజీ, విఠల్‌ని కలిసిన కాశీబుగ్గ సీఐ



**పలాస, డిసెంబరు 12(వార్త):** మాజీమంత్రి శివాజీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్‌ను మర్యాదపూర్వకంగా టీడీపీ కార్యాలయంలో గురువారం కాశీబుగ్గ సీఐ వై.రామకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాశీబుగ్గ ప్రాంతంలో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కల్పించకుండా పనిచేయాలని సూచించారు. ఎటువంటి ఒత్తిళ్లకు తావివ్వవద్దని కోరారు. ఎటువంటి ఇబ్బందులకు అవకాశం లేకుండా పని చేస్తానని సీఐ స్పష్టం చేశారు.

## పెద్ద పద్మాపురంలో అనఘాష్టమి వ్రతం



**మెళియాపుట్టి, డిసెంబరు 12 (వార్త):** అనఘాష్టమి వ్రతాన్ని పెద్ద పద్మాపురం గ్రామంలో శ్రీఅవధూత దత్త పీఠంలో కొల్లి గుణాకరరావు, సహచర భక్త బృందం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనఘాదేవి సాక్ష్యాత్తూ లక్ష్మీదేవి అవతారమని, ఆమె ఉపాసన సకల పాపాలను హరిం పజేస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయన్నారు. ప్రతీ సంవత్సరం మార్గశిర మాస కృష్ణపక్ష అష్టమి రోజున ఈ వ్రతం చేస్తారని వారు పేర్కొన్నారు.



## వస్త్ర వ్యాపారంలో అభివృద్ధి సాధించాలి



**నరసన్నపేట, డిసెంబరు 12 (వార్త):** నరసన్నపేటలో హరికృష్ణ షాపింగ్ మాల్‌ను శుక్రవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “వస్త్ర వ్యాపారంలో అభివృద్ధి చెందాలని హరికృష్ణ మాల్ యజమానులకు ఆశీర్వదించారు. కస్టమర్లకు సరసమైన ధరలకు నాణ్యమైన వస్త్రాలను అందిస్తే ప్రజల ఆదరణతో వ్యాపారం మరింత వృద్ధి చెందుతుందని తెలిపారు. వ్యాపార సత్కారాన్ని పొందటం నమ్మకం, నాణ్యత, సేవలపై ఆధార పడుతుందని సూచించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు హరిప్రసాద్ కూడా వ్యాపారానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, నరసన్నపేటంలో వ్యాపార రంగం అభివృద్ధికి ఇటువంటి సంస్థలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంగ్లీష్ ధారాళంగా మాట్లాడిన విద్యార్థులను అభినందించిన ఎంఈఓ



**నరసన్నపేట, డిసెంబరు 12 (వార్త):** నరసన్నపేటలోని బోర్డు ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 దాలినాయుడు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాల కార్యకలాపాలను, విద్యార్థుల అభ్యాస స్థాయిని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న బోధన-అభ్యసన విధానాలను సమీ క్షించారు. ప్రత్యేకంగా 4వ తరగతి విద్యార్థులు ఇంగ్లీష్‌లో స్వేచ్ఛగా, ధైర్యంగా మాట్లాడిన తీరు ఎంఈఓను ఆకట్టుకుంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఇంత మంచి భాషా సామర్థ్యం ప్రదర్శించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయుల కృషిని కూడా ప్రశంసించారు. పాఠశాల రికార్డులను పరిశీలించిన ఎంఈఓ, విద్యార్థుల ప్రగతిని కొనసాగించేలా ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



**సారవకోట, డిసెంబరు 12 (వార్త):** రానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు సమగ్రమైన ప్రణాళికతో సిద్ధం కావాలని టెక్కలి డిప్యూటీ ఈఓ విలియమ్స్ సూచించారు. స్థానిక అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న 10వ తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన 100 రోజుల ప్రణాళికను ఎలా అమలు చేయాలి, ఏ విషయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి, ప్రతిరోజూ చదువు పట్ల ఏ విధంగా నిబద్ధత కలిగి ఉండాలో డిప్యూటీ ఈఓ వివరిస్తూ కీలక సూచనలు చేశారు. విద్యార్థులు తమ బలహీనతలను గుర్తించి లక్ష్యపూర్వకంగా అభ్యాసం చేయాలని, ఉపాధ్యా యులు నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని ఆయన సూచించారు. సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు ప్రణాళికను పాటించి మెరుగైన ఫలితాలు సాధిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి సారవకోట, అలుదు, బుడితి, చిన్న కిట్టాలపాడు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

## యువత మత్తు బారిన పడకూడదు

**-శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష**

**-మత్తు వ్యతిరేక వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ**

**శ్రీకాకుళం, డిసెంబరు 12 (వార్త):** ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి రూపొందించిన మత్తు వ్యతిరేక వాల్‌పోస్టర్లను శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగదా ఆమె మాట్లాడుతూ “యువత మేలుకుని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమాజ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో ముఖ్యమైనదన్నారు. మత్తు నుంచి దూరంగా ఉంటేనే దేశ ప్రగతికి బలం అందుతుందన్నారు. కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి మత్తు వ్యసనాన్ని అరికట్టాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలపై యువతలో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి బి.సంతోష్, కొన్న శ్రీనివాస్, ఏఐవైఎఫ్ టౌన్ నాయకులు అన్నాజీ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## సంతబొమ్మాళిలో ఆత్మనిర్భర భారత్

**సంతబొమ్మాళి, డిసెంబరు 12(వార్త):** ఆత్మనిర్భర భారత్ (స్వయం సమృద్ధి) అభియాన్‌లో భాగంగా సంతబొమ్మాళి మండలం బీజేపీ అధ్యక్షుడు దేపల్లి కామయ్య ఆధ్వర్యంలో స్వదేశీ వస్తువులు వాడదాం అనే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండల బీజేపీ నాయకులతో కలిసి "ప్రతి ఇంటింటా స్వదేశీ" నినాదంతో ఇంటింటికి మలగాం పంచాయతీ గ్రామాల్లో స్వదేశీ లోగో స్టిక్కర్లు అంటించారు.

స్వదేశీ వస్తువులను ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసే విధానాన్ని అలవర్చుకుని, వినియోగించాలని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో మండల యువత నాయకుడు దేపల్లి నాగరాజు, ప్రధాన కార్య దర్శి దేపల్లి పాపారావు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని పీవోకు వినతి



**మెళియాపుట్టి, డిసెంబరు 12 (వార్త):** మారుమూల ప్రాంతాల్లో ప్రజలు వివిధ రకాల సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంఘ నాయకుడు, జనసైనికుడు లక్ష్మీపురం కిరణ్ కుమార్ ఐటీడీఏ పీవో స్వప్నిల్ పవార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. శిథిలావస్థకు చేరిన డీఆర్డీపోల పునర్నిర్మాణం చేపట్టాలని, మారుమూల గ్రామాల్లో తాగునీరు సౌకర్యాలను మెరుగుపరచాలని, గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట రాజు, సింహాద్రి గణేష్ తదితరులు ఉన్నారు.

## క్రమశిక్షణ అవసరం



**శ్రీకాకుళం, డిసెంబర్ 12 (వార్త):** విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని, నిజాయతీ, గౌరవం, నైతిక విలువలు నేర్పుతుందని సినీనటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. పొందూరు మానసవేణి పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో ముచ్చటించారు. విద్య మనలోని ఆత్మవిశ్వాసాన్ని పెంచి భవిష్యత్‌కు సిద్ధం చేస్తుందని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నప్పుడు వారి జీవితంలోని ఇతర అంశాలపై బాధ్యత వహించడం సులభ మవుతుందని అన్నారు. లక్ష్యసాధనలో మన జీవితంలో విజయం సాధించడానికి పునాది వేస్తుందని హితవు పలికారు. విద్యార్థుల సమస్యలపై యూనివర్సిటీ, పేపర్ లీక్ చిత్రాలు తీశామన్నారు. తాను తీసే సినిమాలన్నీ సందేశాత్మకంగానే ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో మానసవేణి పాఠశాల ప్రధానో పాధ్యాయుడు మాచర్ల కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రబీ పంటలకు 2379 మెట్రిక్ టన్నుల
## యూరియా నిల్వలు

**శ్రీకాకుళం, డిసెంబర్ 12 (వార్త):** రబీ 2025-26కి సంబం ధించిన మొక్కజొన్న, వరి, ఇతర పంటలకు అవసరమైన యూరియాను జిల్లాకు కేటాయించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాధ స్వామి తెలిపారు. పంట విస్తీర్ణాన్ని బట్టి మండలాల్లోని రైతు సేవా కేంద్రాలు (ఆర్బీకేలు), పి.ఏ.సి.ఎస్/డి.సి.ఎం.ఎస్ కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు యూరియాను సజావుగా సరఫరా చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రీటైల్ కేంద్రాలలో 2379 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. రైతులు తమకు దగ్గరలోని రైతు సేవా కేంద్రాలు, పి.ఏ.సి.ఎస్/డి.సి.ఎం.ఎస్, ప్రైవేటు దుకాణాలను సంప్రదించి యూరియాను పొందవచ్చని సూచించారు.

## అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం



**ఆమదాలవలస, డిసెంబర్ 12 (వార్త):** ఆమదాలవలస నియో జకవర్గంలో అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలసలో గృహ నిర్మాణ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం అనుమతి పత్రాలను మున్సిపల్ కార్యా లయ ప్రాంగణంలో ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లను మంజూరు చేస్తున్నా మన్నారు. ఈ పథకం ద్వారా అందించే ఆర్థిక సహాయం అర్హుల్లో రెండు లక్షల 50 వేలు (కేంద్ర ప్రభుత్వం-1,50,000, రాష్ట్ర ప్రభుత్వం 1,00,000) అంద జేస్తుందన్నారు. గృహ నిర్మాణ ప్రక్రియలో ఏదైనా సమస్యలు ఎదురైతే నేరుగా తమను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, మున్సిపల్ అధికారులు, హౌసింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## యువత మత్తు బారిన పడొద్దు

**శ్రీకాకుళం, డిసెంబర్ 12 (వార్త):** మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కె.సాయి ప్రత్యూష అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి రూపొందించిన మత్తు వ్యతిరేక వాల్‌పోస్టర్లను ఆర్డీవో ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత మేలుకుని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సమాజ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో ముఖ్యమైనదని చెప్పారు. మత్తు నుంచి దూరంగా ఉంటేనే దేశ ప్రగతికి బలం అందుతుందన్నారు. కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి మత్తు వ్యసనాన్ని అరికట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి బి.సంతోష్, కొన్న శ్రీనివాస్, ఏఐవైఎఫ్ టౌన్ నాయకులు అన్నాజీ తదితరులు పాల్గొన్నారు.



# రాంపురం.. దాతృత్వానికి ప్రతిరూపం

### -క్యాన్సర్ రోగి కుటుంబానికి రూ.86,000 అందజేత



**మందస, డిసెంబరు 12(వార్త):** ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకోవడం రాంపురం నైజం. గ్రామమంతా ఏకమై, వారి కష్టం తమ కష్టంగా భావించి.. ఆదుకుంటారు.

రాంపురం గ్రామానికి చెందిన కరజాడ ఢిల్లేశ్వరరావుకు బ్రెయిన్ క్యాన్సర్ సోకింది. కష్టంలో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి గ్రామం నిర్ణయించుకుంది. రాంపురంలోని (మార్స్క్ లైన్ ఫిట్టర్ గ్రూప్, మర్చంట్ నేవీ గ్రూప్)ఉద్యోగులు, గ్రామస్తులు కలిసి సాయానికి ముందుకు వచ్చారు. కరజాడ ఢిల్లేశ్వరరావు బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న నేపథ్యంలో, గ్రామ ప్రజలు, విదేశీ నౌకాయాన రంగంలో పనిచేస్తున్న గ్రూప్ సభ్యులు ఐక్యతతో ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించారు. గ్రూప్‌లో ఉన్న యువకులు సమన్వయంతో పెద్దమొత్తంలో సహాయం అందించడమే కాకుండా, విదేశాల్లో ఉన్నప్పటికీ తమ ఊరి మనిషి కష్టంలో ఉన్నాడనే విషయం తెలిసి వెంటనే స్పందించడం, వారి మానవతా విలువలకు నిదర్శనం. రాంపురం గ్రామస్థులు, గ్రూప్ కలిసి రూ.86,000లను సేకరించి, గ్రామ పెద్దల సమక్షంలో ఆయన కుటుంబానికి అందజేశారు.

ఈ సందర్భంగా ఢిల్లేశ్వరరావు కుటుంబసభ్యులు సహాయం చేసిన ప్రతీ ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామంలో ఎవరికైనా ఇబ్బంది వచ్చినప్పుడు అందరూ ఒక కుటుంబంలా కలిసి నిలిచే మన రాంపురం ప్రజల హృదయం ఎంతో గొప్పది అని వారు పేర్కొన్నారు.

కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

## హిందూ సమాజంలో దేశభక్తి జాగరణ కావాలి



**శ్రీకాకుళం, డిసెంబర్ 12(వార్త):** ఒప్పంగి గ్రామంలోని డీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సమ్మేళనం అధ్యక్షులు బాన్న సింహాచలం మాట్లాడుతూ నేటి యువతకు దైవ భక్తి ఉందని, దేశభక్తి కూడా ఉండాలన్నారు. హిందూ సమాజంలో దేశభక్తి జాగరణ కావాల్సివుందని తెలిపారు. ప్రపంచంలో జరుగుతున్న మార్పులు గమనిస్తూ... మనలో చైతన్యం రావాల్సివుందని చెప్పారు. అందుకు మనందరం ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరాలన్నారు. సమ్మేళనం ముఖ్య అతిథి, రిటైర్డు తహశీల్దార్ కంబాల పాపారావు మాట్లాడుతూ దేశానికి ఆర్‌ఎస్‌ఎస్ సేవలు అవసరమన్నారు. వక్త వేణుగోపాల నాయుడు మాట్లాడుతూ హిందూ సమాజం ఐకమత్యం కావలసిన అవసరం చాలా ఉందని తెలిపారు. మన దేశ ప్రజలంతా ఒకటే అనే భావన రావాలని, వందేమాతరం ఉద్యమం మనల్ని ఐకమత్యం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ్ కార్యవహ డీవీ రమణమూర్తి, వీఆర్వో గొలివి అప్పారావు, ఎస్‌ఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ రుప్ప రమణమూర్తి, నక్క లక్ష్మణరావు, వప్పంగి, సానివాడ, ఖాజీపేట గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఆర్థిక భారం లేకుండా అందరికీ ఆరోగ్య సంరక్షణ

**శ్రీకాకుళం, డిసెంబర్ 12 (వార్త):** ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ప్రతి ఒక్కరూ నాణ్యమైన ఆరోగ్య సేవలను పొందేలా చూడటమే విశ్వజనీన ఆరోగ్య పరిరక్షణ దినోత్సవం ప్రధాన లక్ష్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ కె. హరిబాబు స్పష్టం చేశారు. ఆరోగ్యం కోసం చేసే ఖర్చుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం పెద్ద సంఖ్యలో ప్రజలు తీవ్ర పేదరికంలోకి నెట్టబడుతున్నారని, కనీసం సగం మందికి ఇప్పటికీ అవసరమైన వైద్య సేవలు అందడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సింగపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏఎన్ఎంలకు, ఇతర సిబ్బందికి శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ జి. ఇందిరాప్రసాద్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ లిల్లీ పాల్గొన్నారు.

## జూబ్లీ రోడ్డులో నీటి సమస్యను పరిష్కరించండి



**పాతపట్నం, డిసెంబర్12 (వార్త):** పాతపట్నం మండల కేం ద్రంలోని జూబ్లీ రోడ్లో నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులతో పాటు నవ జీవన్ ట్రస్టు హాస్టల్ విద్యార్థులు శుభోదయం మిత్ర బృందంతో పాటు రేగటి షణ్ముఖరావును కోరారు. శుక్రవారం జూబ్లీ రోడ్డు ప్రాంతాన్ని షన్ముఖరావు సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులు రోడ్డుపై నిలిచిన నీటిని చూపించారు. ఈ సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లా మన్నారు. నవజీవన్ ఆశ్రమంలో ఉన్న వారు కూడా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. దీనిపై ఎమ్మెల్యేతో పాటు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వెళతామని రేగటి షన్ముఖరావు తెలిపారు.

## వంశధార రిజర్వాయర్‌లో చేప పిల్లలు విడుదల




**హిరమండలం, డిసెంబర్ 12 (వార్త):** 4.86 లక్షల ఫింగర్లింగ్ చేప పిల్లలను బీఆర్ఆర్ వంశధార రిజర్వాయర్‌లో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంద న్నారు. అధిక నాణ్యత కలిగిన చేప పిల్లల విడుదలతో వంశధార రిజర్వాయర్‌లో చేపల ఉత్పత్తి పెరిగి మత్స్యకారులకు ఆదారం వస్తుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మత్స్యకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాల పురోగతే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### * ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ * బూర్జ మండల సర్వసభ్య సమావేశం





**బూర్జ, డిసెంబర్ 12(వార్త):** బూర్జ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ ముఖ్యఅతిథిగా ఈ సమావేశానికి హాజరై గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, తదితర అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వం ప్రాథమిక లక్ష్యమన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాల అమలుకు ప్రతి అధికారి సమన్వ యంతో పనిచేయాలన్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు వంటి అంశాలను అధికారులను వెంటనే పరిశీలించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభు త్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు పెన్షన్లు, అన్నదాత సుఖీభవ తల్లికి వందనం ఉచిత గ్యాస్ సిలిండర్లు లాంటి పథకాలు గ్రామ స్థాయిలో పారదర్శకంగా అమలు చేయడంలో ఎలాంటి విఘాతం ఉండకూడదని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమా వేశంలో మార్క్ ఫెడ్ స్టేట్ డైరెక్టర్ ఆనేపు రామకృష్ణ, ఎంపీపీ, ఎంపీడీవో, తహ శీల్దార్, ఇంజినీర్లు, ఆరోగ్య, సచివాలయ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, సిబ్బందితో పాటు సభ్యులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు అవగాహన

**కొత్తూరు, డిసెంబర్ 12 (వార్త):** మండల పరిధిలోని మెట్టూరు బిట్-1 గ్రామంలోని ప్రజల్లో నేరాలనియంత్రణకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని కొత్తూరు ఎస్సై కె.వెంకటేశ్ శుక్రవారం నిర్వహించారు. నేటి సమాజంలో యువత, మహిళలు ఎదుర్కొంటున్న మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు, మహిళా భద్రత వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. యువత మత్తుపదార్థాల బారిన పడకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, వాటి వల్ల కలిగే శారీరక, మానసిక నష్టాలను వివరించారు. అలాగే సైబర్ నేరాలకు సంబంధించిన అవగాహన కల్పిస్తూ, తెలియని లింకులు క్లిక్ చేయకూడదని, ఓటీపీను ఎవరితోనూ పంచుకోవద్దని ప్రజలకు సూచించారు. మహిళలపై నేరాలు జరిగితే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, షీ టీమ్‌ల సహాయం గురించి వివరించారు.





## డాగ్ స్క్వాడ్ తనిఖీలు

**పలాస, డిసెంబరు 12 (వార్త):** పోలీస్ డాగ్ స్క్వాడ్‌లు పలాస రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లలో భద్రతా తనిఖీలు పోలీసులు శుక్రవారం రాత్రి తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలు బాంబులు, మాదక ద్రవ్యాలు, చోరీలు, ఇతర నేరాలను నిరోధించడానికి తనిఖీలు చేశామని కాశీబుగ్గ సీఐ రామకృష్ణ వెల్లడించారు. మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి నిషేధిత పదార్థాలు గుర్తించడానికి డాగ్ స్క్వాడ్ ఉపయోగిస్తామని చెప్పారు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఈ రకమైన భద్రతా చర్యలు మరింత ముమ్మరంగా జరుగుతుంటాయని చెప్పారు. ఎవరైనా గంజాయి, తదితర మాదకద్రవ్యాలు తరలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు.

### కూటమి ప్రభుత్వం..
## రైతు వ్యతిరేక ప్రభుత్వం

### * మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి




**కొత్తూరు, డిసంబరు 12 (వార్త):** టీడీపీ కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి రైతును దేశ వెన్నుముకగా భావించి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, ఆయన బాటలోనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు సంక్షేమానికి కృషి చేశారన్నారు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైంద న్నారు. రైతులకు ఎరువులు సమయానికి అందడం లేకపోవడం, మధ్యవర్తుల చేతుల్లో కొనుగోలు ప్రక్రియ ఉండడం వలన రైతులు భారీ నష్టాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళారుల కృత్రిమ కొరతలు సృష్టించి ఎరువులకు అధిక ధరలు వసూలు చేస్తున్నారన్నారు. రైతులకు కనీస మద్దతు లేకుండా పాలన సాగుతోందని విమర్శించారు. జిల్లా వ్యవసాయ సమస్యలపై మంత్రి అచ్చెన్నాయుడు పూర్తిగా విఫలమయ్యారని ఆమె విమర్శించారు. ఆయన హంగు, ఆర్భాటాలకే పరిమితం అయ్యారు తప్ప రైతుల సమస్యలపై శ్రద్ధ చూపే పరిస్థితి కనిపించడం లేదు అని వ్యాఖ్యానించారు. రైతు సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని ఎరువుల సరఫరా, ధాన్యం కొనుగోలు విధానం, మద్దతు ధరల విషయంలో స్పష్టమైన విధానం అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546